# బాబు

శ్రీ ఆకెళ్ళ జానకిరామ సుబ్రహ్మణ్యం

[జానికమ్మ తన కుమారుని అష్టకష్టాలుపడి పెంచుతూంటుంది. ఆమె జీవితంలో బాబు పెరిగి పెద్దవాడై చదువు సంధ్యలు నేర్చుకొని అభివృద్ధిగాంచితే చూచి ఆనందించి సుఖపడాలనే ఆమె ఆశ. దాని కనుగుణ్యంగా బాబు సయితం బుద్ధిమంతుడుగా చదువుకొంటూండేవాడు. ఒక రోజు రాత్రి పొద్దుపోయిందాక బాబు బడినుండి యింటికి తిరిగి రాలేదు. జానికమ్మ బాబు నడతను గురించి తర్కించుకుంటూ ఎదురు చూచిచూచి పడుకుంది. రాత్రి పదిగంటల తరువాత బాబు తిరిగి రాగానే అన్నముపెట్టి పండుకోమని చెప్పింది. బాబు భయపడుతూ పండుకోబోయే సమయాన జానకమ్మ పిలిచి 'ఎక్కడికెళ్లావింతవరదాక' అని గద్దించి అడిగింది. — యిక చదువండి.]

(గతసంచిక తరువాయి)

"ఎక్కడికి వెళ్లలేదే" అని అబద్ధం ఆడేడు భయంతో తన తప్పును కప్పిపుచ్చుకుందుకై. అలాగని చెప్పినంతమాత్రాన తన తల్లి ఇంక అడగదనుకున్నాడు పాపం బాబు.

జానికమ్మగారు లేచింది. బాబుచెవిపట్టుకుని గట్టిగా మెలితిప్పుతూ "ఈసారిచెప్పు. ఎక్కడికి వెళ్లేవో" అతి నెమ్మదిగా, ఈ విషయం ప్రక్కయింటివాళ్ళకి ఏంతెలిసిపోతుందోననే భయంతో అడిగింది.

"చెవినొప్పెవ్ ... అమ్మోయ్, వదలవేవ్" ఏడవటం మొదలుపెట్టాడు గట్టిగా, అసలు విషయం చెప్పకుండా.

"నోర్మూయ్ రాగం పైకి రానిచ్చావా, నడ్డివాచిపోతుంది." ఏడవటానికి నోరు తెరచిన బాబునోరు అలాగే తెరచివుండి పోయింది.

"చెప్పు ఎక్కడికెళ్ళావో?.. త్వరగా చెప్పాలి" తిరిగి గట్టిగా మెలిపెట్టింది చెవిని.

"సి...నీ...మా...కు వెళ్ళేనే." వెక్కి, వెక్కి వస్తున్న ఏడుపును ఆపుకుంటూ సమాధానం యిచ్చాడు బాబు.

"ఎవరితోటి?...అసలు నీకుడబ్బులెక్కడివి?" అని అడుగుతూ, బాబు చెయ్యిపెట్టుకుని, ప్రక్కగదిలోకి తీసుకుపోయింది, ఈగొడవంతా అందరూ వినిపోతారని. బాబు బెదరుచూపులు తప్పితే ... నోటంపటమాట వూడిపట్టంలేదు.

చూరులోవున్న వేపబెత్తంతీసింది ... బాబు విషయమై, ఈ బెత్తం ఇంతవరకు అవసరంరాలేదు. దాని అవసరం ఈ రోజున రావటంతో, చిత్తంవచ్చినట్టు విజృంభించింది. "ఎక్కడికెళ్ళేవు ... ఓ దెబ్బ; చెప్పు ... మరోదెబ్బ" ప్రశ్నకో దెబ్బచొప్పున టకటకా ప్రశ్నలతో అతని మనస్సును, దెబ్బలతో అతని శరీరాన్ని కదలించివేసింది జానికమ్మగారు.

"మా క్లాసు కుర్రాడు తీసుకువెళ్ళేడు ... డబ్బులు వాడేపెట్టుకున్నాడే. ఇంకెప్పుడూ వెళ్ళనే ... కొట్టకే. నేనెప్పుడూ వెళ్ళనే" దెబ్బలకు గజగజావణికిపోయాడు బాబు.

"మరి మొట్టమొదట అబద్ధం చెప్పేవేం ... ఇంకెప్పుడూ అబద్ధం ఆడకేం! ... ఏం! ఏం!" గబగబా - ఎక్కడ కొడుతోందో తెలియకుండా, వళ్లు హూనంచేసిపడేసింది.

"ఇంకెప్పుడూ అబద్ధంఆడనే...సినీమాకు వెళ్ళనే. నామాటనమ్మ ... జాగ్రత్తగా చదువుకుంటానే. ఈ సారి పొద్దుపోయివస్తే చంపేయవే ... కొట్టకే బాబూ, కొట్టకే" దెబ్బదెబ్బకు గిరగిరా తిరుగుతూ, ఆఖరికి తల్లి కాళ్ళమీద పడ్డాడు.

"వెళ్ళు వెధవా ,.. పడుకో" బెత్తం వాడి మొహానవిసరి, వీధిగదిలోకివచ్చిపడుకుంది జానికమ్మగారు.

"అమ్మా" అని మూలుగుతూ, ఎంతో బాధతో లేచేడు. లేచేటప్పుడు ప్రతీఅవయవం బాధపెట్టింది. దీపం పెద్దదిచేసి శరీరం అంతా చూసుకున్నాడు. కనీసం ప్రతి అంగుళానికి, ఓ వాత చొప్పున, దద్దుర్లతో శరీరం అంతా నిండిపోయింది. మోకాలి చిప్ప దగ్గర రక్తం కారుతోంది. రక్తాన్నిచూసి, పెల్లుబికి వస్తున్న ఏడుపును ఆపుకోలేకపోయాడు. "అమ్మా! ..." ఒక్కసారి గట్టిగా రాగంతీసి తిరిగి నోరు నొక్కేసుకున్నాడు. అమ్మ లేచిందంటే మళ్లీ శరీరం వాచిపోతుంది. ... ఏడుపును దిగమింగుకుంటూ, దెబ్బలకు అలిసిపోయినబాబు, నిద్రపోయాడు.

"అమ్మా" అంటూ నిద్రలో మూల్గుతున్నాడు బాబు. శరీరం అంతా వణికిపోతోంది.

గాఢనిద్రలోవున్న జానికమ్మగారికి ఆ పిలుపు వినపడేసరికి, మెలుకువవచ్చింది. ఆతృతతో 'ఏం నాయనా' అంటూ శరీరంమీద చెయ్యివేసింది. శరీరం కాలిపోతోంది.

"అబ్బా! నొప్పి" అంటూ రెండోవైపుకు వొత్తిగిల్లాడు. ఆ దీపకాంతిలో బాబు శరీరంమీద వాతలు, దద్దుర్లుగా తేలి, స్పష్టంగా కనపడుతున్నాయి జానికమ్మగార్కి.

"దెబ్బలు నొప్పి పుట్టవునాయనామరి! ... ఎప్పుడూ నేచెప్పినట్టుగా వింటుంటే దెబ్బలు తగలవు. నువ్వింత ఆలస్యంగా వచ్చినందుకు నా మనస్సెంత బాధపడిందో నీ పసిహృదయానికి ఏమితెలుసు? నేను బాధపడిన బాధలో, నువ్వు అనుభవిస్తున్న బాధ ఎన్నోవంతు? నువ్వు చెడుస్నేహాలుచేసి పాడైపోతుంటే, నాకు బాధకదూ! ఆశలన్నీ నీమీదపెట్టుకొని ... నువ్వే మన వంశానికి గౌరవప్రతిష్ఠలు తెస్తావని ఆశిస్తున్న నేను, నువ్వీ విధంగా చెడిపోతూవుంటే, చూస్తూ వూరుకోగలనా? ... అందుకనే పళ్లుతెలియని ఆవేశంలో, కొట్టేచోట కొట్టనిచోట తెలుసుకోకుండా నిన్ను కొట్టేను. ... పోనీ నువ్వే ఆలోచించుకో ... నీకు జ్ఞానంవచ్చిన తరువాత నిన్ను ఎప్పుడైనా ఈ విధంగా కొట్టేనా? నువ్వు ఎప్పుడైనా ఇటువంటి పాడుపనులుచేసి ఎరుగుదువా" అని ఇంకా ఏవేవో అంటూ, నూనెతెచ్చి, దెబ్బలికి రాసింది.

"అమ్మా! నేనెప్పుడూ అబద్ధంఆడనే ... ఎప్పుడూ సినీమాకు వెళ్ళనే. నామాటనమ్మ ... పాడుస్నేహాలుచెయ్యనే. చదువుకుంటానే...కొట్టకే, కొట్టకే..." అంటూ నిద్రలో పలవరిస్తున్నాడు బాబు.

"నిన్ను ఎప్పుడూ కొట్టనుబాబు. ... అనవసరంగా ఎందుకుకొడతాను" అంటూ బాబును తన హృదయానికి హత్తుకుని, తనివితీరా ముద్దుపెట్టుకుంది.

దాంతో బాబుకు మెలుకువవచ్చి, ఆశ్చర్యంతో తల్లికళ్ళలోకి చూస్తూ కూర్చుండిపోయాడు.